నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
13 | హైదరాబాద్, శనివారం 20 జనవరి 2024 | YADADRI BHUVANAGIRI

జాన్‌పహాడ్ దర్గాకు పోటెత్తిన భక్తులు

పాలకవీడు, జనవరి 19 : మండలంలోని జాన్‌పహాడ్ దర్గాకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 25నుంచి దర్గా ఉర్సు ప్రారంభం కానుండగా.. ఇప్పటి నుంచే సైదులు బాబా సమాధుల దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని దర్గా ముజావర్ జానీ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున రావడంతో దర్గా పరిసరాలు కిక్కిరిశాయి.

జాన్‌పహాడ్ దర్గా వద్ద భక్తులు

'ట్రిబుల్ ఆర్' కథ మళ్లీ మొదటికి..

హైకోర్టు స్టే క్లియర్ చేసేందుకు సర్కారు చర్యలు

- ప్రాజెక్టు పనులు స్పీడప్ చేయాలని సీఎం ఆదేశం
- హుటాహుటిన సమావేశమైన ఉన్నతాధికారులు
- రెండు, మూడు రోజుల్లో కోర్టులో పిటిషన్ దాఖలు..!
- వచ్చే నెలలో 3జీ నోటిఫికేషన్ ఇచ్చేలా ప్లాన్
- ప్రియాంక, కాంగ్రెస్ హామీ బుట్టదాఖలు
- నమ్మించి నట్టేట ముంచారని రాయగిరి రైతుల ఆగ్రహం
- మరో దఫా ఉద్యమానికి సన్నద్ధం
- చౌటుప్పల్ లింగోజిగూడెం అలైన్‌మెంట్ మార్పు?

యాదాద్రి భువనగిరి, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పరిధిలోని రాయగిరి ట్రిబుల్ ఆర్(రీజినల్ రింగ్ రోడ్డు) రైతుల కథ మళ్లీ మొదటికి వచ్చింది. హైకోర్టు స్టే తెచ్చుకున్నామని సంతోషించే లోపు సర్కారు అడ్డం తిరుగుతున్నది. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో అధికారులు శుక్రవారం హుటాహుటిన సమావేశమయ్యారు. హైకోర్టు స్టేను క్లియర్ చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెలలో 3జీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అలైన్‌మెంట్ మార్చిస్తామని ఏకంగా ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శితోపాటు నేతలంతా హామీ ఇచ్చారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే తమను నమ్మించి మోసం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోసారి ఉద్యమానికి సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే చౌటుప్పల్ లింగోజిగూడెం అలైన్‌మెంట్ మార్చనున్నటు విశ్వసనీయంగా తెలిసింది.

త్రిబుల్ ఆర్ ప్రాజెక్ట్‌లో భాగంగా సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి మెదక్, సిద్దిపేట జిల్లాల మీదుగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్ వరకు హైదరాబాద్ ఉత్తరభాగం తొలివిడతలో రీజినల్ రోడ్డు నిర్మించనున్నారు. 159 కిలోమీటర్ల మేర 100 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇందుకు అనుగుణంగా అధికారులు సిద్ధమవుతున్నారు. చౌటుప్పల్, వలిగొండ, భువనగిరి, యాదగిరిగుట్ట, తుర్కపల్లి మండలాల పరిధిలోని 34 రెవెన్యూ గ్రామాల్లో భూసేకరణ చేపట్టనున్నారు. ఇప్పటికే త్రీడీ నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. అయితే తాము ఇప్పటికే మూడు దఫాలుగా వివిధ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయామని, మరోసారి ఇవ్వలేమని ఇటీవల హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు.

వచ్చే నెల 3జీ నోటిఫికేషన్ జారీ..

ఓ వైపు కోర్టు నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకుంటూనే.. మరోవైపు త్రిబుల్ ఆర్ ప్రాజెక్టు పనులు ముందుకు సాగేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. వచ్చే నెల మొదటి వారంలో కలెక్టర్ మరోసారి రివ్యూ చేపట్టనున్నారు. ఇప్పటికే త్రిబుల్ ఆర్‌కు త్రీడీ నోటిఫికేషన్ వచ్చింది. వచ్చేలా 3జీ నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఇది వెలువడితే భూ నిర్వాసితులకు అవార్డు పాస్ చేస్తారు. వారి బ్యాంక్ ఖాతాల్లో పరిహారం డబ్బులు జమ చేస్తారు. కాగా రాయగిరి పరిధిలో రూ. రెండున్నర కోట్లు పరిహారం అవసరం పడతాయని అంచనా వేశారు.

మండిపడుతున్న రైతులు

కాంగ్రెస్ పార్టీ నాడు ఓట్ల కోసం తమను నమ్మించి మోసం చేసిందని రాయగిరి రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామంటే వద్దని, ఓట్లు చీలుతాయని, మన పార్టీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అలైన్‌మెంట్ మారుస్తామని హామీ ఇచ్చారని మండి పడుతున్నారు. ఇప్పుడు తీరా గెలిచాక ముఖం చాటేస్తున్నారని సోషల్ మీడియా వేదికగా దుమ్మెత్తి పోస్తున్నారు. కాంగ్రెస్ చర్యలతో ఆగ్రహించి రైతులు ఏకంగా శుక్రవారం కుంభం అనిల్ కుమార్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన నుంచి ఆశించిన స్పందన రాకపోవడంతో మరోసారి ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు.

కోర్టు స్టే క్లియర్‌కు పిటిషన్..!

త్రిబుల్ ఆర్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని రెండు రోజుల క్రితం సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వీలైనంత త్వరలోగా పనులు జరుగాలని సూచించారు. దీంతో జిల్లాలో ఉన్నతాధికారులు వెంటనే చర్యలు ప్రారంభించారు. కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు, ఆర్డీఓలు, ఇతర అధికారులు శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కేవలం 29మందికి సంబంధించి స్టే ఉన్నప్పటికీ, మిగతా వారి భూములను ఎందుకు సేకరించలేదని కలెక్టర్ ప్రశ్నించినట్లు తెలిసింది. కోర్టు స్టే మొత్తం నోటిఫికేషన్‌పై ఉందని ఓ ఆర్డీఓ సమాధానం ఇచ్చినట్లు సమాచారం. దాంతో హైకోర్టులో ఉన్న స్టేను క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో అడ్వకేట్ జనరల్‌ను సంప్రదించి.. సలహాలు తీసుకోనున్నారు. రెండు, మూడు రోజుల్లో కోర్టులో పిటిషన్ వేసి, స్టేను తొలగించేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందిస్తున్నారు. కాగా ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

కాంగ్రెస్ హామీలు బుట్టదాఖలు..

త్రిబుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కొంతకాలంగా రాయగిరి రైతులు ఉద్యమిస్తున్నారు. దీన్ని అప్పట్లో కాంగ్రెస్ క్యాష్ చేసుకోవాలని భావించింది. సందర్భంగా వచ్చినప్పుడల్లా రెచ్చగొట్టే ప్రయత్నం చేసింది. అనేక సార్లు ఉద్యమానికి ఆ పార్టీ నేతలు మద్దతు పలికారు. అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మార్చిస్తామని హామీ ఇచ్చారు. అనేక సందర్భాల్లో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మద్దతుగా నిలిచి మార్చాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఏకంగా ధర్నాలో పాల్గొన్నారు. ఇక ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ తమ పార్టీని గెలిపిస్తే మార్చిస్తామని బహిరంగంగా ప్రకటించారు. కానీ ఇప్పుడు అదే కాంగ్రెస్ పార్టీ త్రిబుల్ ఆర్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటున్నది.

చౌటుప్పల్ లింగోజిగూడ అలైన్‌మెంట్ మార్పు?

త్రిబుల్ ఆర్ ప్రాజెక్టులో భాగంగా కీలక మార్పు చోటు చేసుకోనుంది. చౌటుప్పల్ లింగోజిగూడ అలైన్‌మెంట్ మారనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీన్ని ఇప్పటికే హోల్డ్‌లో పెట్టినట్లు సమాచారం. దీన్ని మార్చి వేరే చోట నుంచి అలైన్‌మెంట్ చేయనున్నట్లు తెలిసింది. దీనిపై త్వరలోనే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. అయితే అలైన్‌మెంట్ ముందుకు వెళ్తదా..? వెనుకకు పోతుందా అనేది క్లారిటీ రావాల్సి ఉంది.

లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్యోత్సవాలు



అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జనవరి19 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ ఆలయంలో నిత్యోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధనతో పాటు ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేశారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణ తంతును చేపట్టారు. ప్రధానాలయంలో సాయంత్రం స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్ సేవను ఘనంగా నిర్వహించారు. రాత్రి స్వామివారికి తిరువారాధన, తులసీ సహస్ర నామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్ర నామార్చన జరిపారు. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం కనుల పండువగా సాగింది. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు -- వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని ఆలయ ఖజానాకు రూ. 19,46,626ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రామకృష్ణారావు తెలిపారు.

అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, జనవరి 19 : భారత గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఆయన జిల్లా అధికారులతో సమీక్షించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రగతిపై ప్రసంగ పాఠం తయారు చేయాలని, వేదిక, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను, జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉద్యోగుల ప్రశంసా పత్రాల బహూకరణకు నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల వివరాలను పంపాలని సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎ.భాస్కర్‌రావు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి, పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, రెవెన్యూ డివిజనల్ అధికారులు అమరేందర్, జగన్నాథరావు, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు : కలెక్టర్

ఈ నెల 20, 21 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ హనుమంతు కే.జెండగే తెలిపారు. రెండు రోజులు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని పేర్కొన్నారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు మోగిన గంట

నేడు నోటిఫికేషన్ విడుదల.. 29న ఎన్నికలు

- షెడ్యూల్ విడుదల చేసిన విద్యాశాఖ
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,088 పాఠశాలల్లో ఎన్నికలు
- చేతులెత్తే విధానం, అవసరమైతే రహస్య బ్యాలెట్‌తో ఎన్నిక

భువనగిరి అర్బన్, జనవరి 19 : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణలో స్కూల్ మేనేజ్‌మేంట్ కమిటీ(ఎస్ఎంసీ) పాత్ర కీలకమైంది. ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులతో ఏర్పాటు చేసే ఈ కమిటీల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర విద్యాశాఖ షెడ్యూల్‌ను విడుదల చేసింది. 30 నవంబర్ 2019 తర్వాత మళ్లీ ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేయనుండగా ఈ నెల 29న ఎన్నికల జరుగనున్నాయి. దాంతో పాఠశాలల్లో ఎన్నికల సందడి మొదలు కానున్నది. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో వీటి ప్రక్రియ కొనసాగనున్నది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 3,088 పాఠశాలల్లో..

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని 3,088 పాఠశాలల్లో ఎన్నికల నిర్వహణతో నూతన కమిటీలు ఏర్పాటు కానున్నాయి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, కస్తూర్బా, మోడల్, యూఆర్ఎస్, టీఎస్ఆర్ఈఐఎస్, వివిధ శాఖల గురుకుల స్కూళ్లతోపాటు ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు ఓటర్లుగా ఈ ఎన్నికల్లో పాల్గొననున్నారు.

సుదీర్ఘ కాలం తర్వాత...

గతంలో 18 నవంబర్, 2019లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల చేయగా 30 నవంబర్, 2019లో ఎన్నికలు నిర్వహించి కమిటీలను ప్రకటించారు. వీటి పదవీ కాలం 30 నవంబర్, 2021తో ముగియగా కొవిడ్ నేపథ్యంలో పాఠశాలల నిర్వహణ సాగలేదని తమకు న్యాయం చేసి మళ్లీ అవకాశం ఇవ్వాలని ఆయా కమిటీ సభ్యులు, చైర్మన్లు ప్రభుత్వానికి విన్నవించడంతో పదవీకాలం పొడగించారు. దాంతో ఆ కమిటీలు సుదీర్ఘ కాలం పనిచేశాయి. తాజాగా ప్రభుత్వం మళ్లీ నూతన కమిటీల కోసం షెడ్యూల్ జారీ చేసింది.

పాఠశాలల వివరాలు

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
నల్లగొండ	1485	1,03,877
సూర్యాపేట	909	63,805
యాదాద్రి	694	53,248
మొత్తం	3,088	2,27,345

షెడ్యూల్ ఇలా..

- 20న ఉదయం 10 గంటలకు ఎన్నిక నోటిఫికేషన్‌ను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 2గంటలకు అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల ఓటర్ల జాబితా ప్రకటన
- 22న సాయంత్రం 4గంటల వరకు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- 24న ఉదయం 11గంటలకు తుది జాబితా విడుదల
- విడుదల చేసి ఓటర్ల జాబితాలో 50శాతం మంది హాజరైతేనే ఎన్నిక ఉంటుంది. ఎన్నికలను చెతులెత్తే పద్ధతిగానీ, వాయిస్ ఓట్ ద్వారా నిర్వహిస్తారు. అలా జరుగకుంటే రహస్య ఓటింగ్ చేస్తారు.
- 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికల నిర్వహణ. ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక, చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపిక ఉంటుంది. మధ్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు నూతన కమిటీ సమావేశం నిర్వహిస్తారు.

సభ్యుల ఎన్నిక ఇలా ...

- ఎన్నికల్లో 1నుంచి 8వ తరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొంటారు. 9,10 తరగతులు చదివే విద్యార్థుల తల్లిదండ్రులకు కమిటీల్లో అవకాశం ఉండదు.
- ప్రతి తరగతికి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. వీరిలో ఇద్దరు మహిళలు ఉండగా ఒకరు మాత్రం ప్రతి కూల పరిస్థితులు ఎదుర్కొంటున్న వారి పిల్లలు, అనాథ, ఎస్సీ, ఎస్టీ, వలస, వీధి బాలలు, ప్రత్యేకావసరాలున్న పిల్లల తల్లి లేదా తండ్రి ఉండాలి. మరొకరిని బీసీ, మైనార్టీకి చెందిన తల్లిదండ్రుల నుంచి ఒకరిని, మూడో వ్యక్తిని ఎవరినైనా ఎంపిక చేయవచ్చు.
- ప్రాథమిక పాఠశాలల్లో 5 తరగతులుంటే తరగతికి ముగ్గురు చొప్పున 15 మందిని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 7వ తరగతి వరకు ఉంటే 21 మందిని, 8వ తరగతి వరకు ఉంటే 24మంది సభ్యులను, ఉన్నత పాఠశాలల్లో 6, 7, 8 తరగతుల తల్లిదండ్రుల్లో 9మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంటుంది.

ప్రధానోపాధ్యాయులే కన్వీనర్‌గా ..

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మరో సీనియర్ ఉపాధ్యాయులు, వార్డు/కౌన్సిలర్/ఏఎన్ఎం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, అంగన్‌వాడీ కార్యకర్త ఎక్స్ అఫీషియో సభ్యులుగా వ్యవహరిస్తారు. ఎన్నికైన సభ్యులతో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులు ఉంటారు. ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికైన 15 మందితో పాటు ఆరుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్షన్ సభ్యులతో మొత్తం 23 మంది ఉంటారు. ఏడో తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో 29 మంది, 8వ తరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 32 మంది, హైస్కూళ్లలో మొత్తం 17 మంది సభ్యులుంటారు. ఆయా పాఠశాలల పరిధిలో విద్యావేత్త, పాఠశాల అభివృద్ధికి సహకరించే దాతలను ఎస్ఎంసీ కోఆప్షన్ సభ్యులుగా నియమించుకునే అవకాశం ఉంది. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధి లేదా విద్యార్థుల్లో ఇద్దర్ని కోఆప్షన్ చేసుకోవచ్చు. గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్లు సమావేశాలకు హాజరయ్యే హక్కు ఉంటుంది.

షెడ్యూల్ ప్రకారం ఎస్ఎంసీల ఎన్నికలు

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ నెల 20న ఆయా పాఠశాలల హెచ్ఎంలు నోటిఫికేషన్ జారీ చేస్తారు. ఈ నెల 29న అన్ని పాఠశాలల్లో ఎన్నిక జరుగుతుంది. కమిటీలో ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారు. ఎన్నికలు నిర్వహించే సమయానికి 50 శాతం తల్లిదండ్రులుంటేనే ఎన్నిక నిర్వహిస్తాం.

– డీఈఓ కె.నారాయణరెడ్డి, యాదాద్రి భువనగిరి

ఎస్ఎంసీల విధులు ఇవే...

- గ్రామంలోని బడీడు పిల్లలను విధిగా పాఠశాలల్లో చేర్పించడం. విద్యార్థుల విద్యా సామర్థ్యాల పెంపునకు కృషి చేయడం.
- గ్రామాల్లోని దాతలు, ప్రజా ప్రతినిధుల నుంచి నిధులు సేకరించి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించడం.
- ప్రతి మాసం సమావేశాలు ఏర్పాటు చేసి పాఠశాల అభివృద్ధికి కావాల్సిన ప్రణాళికలు తయారు చేసి అమలుకు చర్యలు తీసుకోవడం.
- ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు విధానాన్ని పరిశీలించి, నిధులు సక్రమంగా ఖర్చుపెట్టేలా పర్యవేక్షణ చేయడం.
- మధ్యాహ్నం భోజనం పర్యవేక్షణ చేయడం.
- జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాలతో ప్రతి కార్యక్రమం అమలు చేయాల్సిన బాధ్యత ఎస్ఎంసీపై ఉంటుంది.



నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న అటవీ జంతువులు

నల్లమలలో పెరిగిన జంతువులు

- మూడు రోజులపాటు కొనసాగిన శాకాహార జంతు గణన
- డీఎఫ్ఓ సర్వేశ్వర్

చందంపేట, జనవరి 19 : నల్లమల అటవీ ప్రాంతంలో అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీ ప్రాంతంలో నీటి తొట్ల ఏర్పాటుతోపాటు పలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతం నల్లమల అటవీ ప్రాంతంలో శాకాహార జంతువుల సంఖ్య పెరిగిందని డీఎఫ్ఓ సర్వేశ్వర్ శుక్రవారం తెలిపారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు చేపట్టిన శాకాహార జంతు గణన పూర్తయిందని, ఇందులో జంతువుల సంఖ్య పెరిగినట్లు తేలిందని అన్నారు. చందంపేట మండలంలోని చిత్రియాల, పెద్దమూల, దాసర్లపల్లి, నల్లచెలమూల, బచ్చాపురం గ్రామ సరిహద్దుల్లో ఉన్న ఎర్రపేడ, పాలపేడ ప్రాంతాల్లో అటవీ జంతువుల గణన చేపట్టామన్నారు. ఆయా ప్రాంతాల్లో గతంలో కంటే జంతువుల సంఖ్య భారీగా పెరిగినట్లు చెప్పారు. నల్లమల అటవీ ప్రాంతంలో మనుబోతులు, దుప్పి, జింకలు, అడ వి కుక్కలు, కృష్ణ జింక, ముళ్ల పంది, అడవి పందు లు, ఎలుగుబంట్లు, చిరుత పులుల సంఖ్య పెరిగినట్లు తెలిపారు. చిరుత పులిని ప్లగ్ మార్క్ ద్వారా గుర్తించినట్లు చెప్పారు. చిరుత పులుల సంఖ్య గతంలో కంటే పెరిగిందని డీఎఫ్ఓ తెలిపారు.

దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలి

- దళిత బంధు సాధన సమితి నల్లగొండ జిల్లా కన్వీనర్ నాగార్జున

నల్లగొండ, జనవరి 19 : గత ప్రభుత్వ హయాంలో దళిత బంధు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసే ప్రక్రియను ప్రారంభించాలని దళిత బంధు సాధన సమితి నల్లగొండ జిల్లా కన్వీనర్ పాలడుగు నాగార్జున, తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళిత బంధు ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ శాలిగౌరారం మండల లబ్ధిదారులతో కలిసి కలెక్టరేట్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం భేషజాలకు పోకుండా, పార్టీల వైశమ్యాలను పక్కన పెట్టి దళిత బంధు గ్రౌండింగ్ చేపట్టాలన్నారు. ఎంపిక ప్రక్రియ మొత్తం పూర్తయిందని, నిధులను ప్రీజింగ్ చేయడం సరికాదని పేర్కొన్నారు. నల్లగొండ నియోజకవర్గంలో 1050 మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చారని, శాలిగౌరారం మండలంలో 270 మందిని ఎంపిక చేశారని తెలిపారు. ఎన్నికల కోడ్ రావడంతో గ్రౌండింగ్ ప్రక్రియ ఆగిపోయిందన్నారు. కొత్త ప్రభుత్వం వేగవంతంగా గ్రౌండింగ్ చేసి నిధులను విడుదల చేయాలని కోరారు. పందుల సైదులు మాట్లాడుతూ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాల వలే దళిత బంధును కొనసాగించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు దళిత బంధు లబ్ధిదారులకు రూ.12 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే దళిత, బహుజన, ప్రజా సంఘాలతో కలిసి రాష్ట్ర స్థాయిలో ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మామిడి రమేశ్, ఏర్పుల నరేందర్, పోతెపాక నవీన్, బడుపుల శంకర్, యాకూబ్, రవీందర్, గణేశ్, వెంకట్, కిరణ్, ఎలీష, రవి, శంకర్, కమలాకర్ పాల్గొన్నారు.